# నేను - ఓ పునర్జన్మ!

## ఒక ఆర్థో సర్జన్ ఆత్మకథ

---

**డాక్టర్ యర్రమిల్లి కృష్ణ**

ఎమెస్కో

# విషయసూచిక


| | |
|---|---|
| ఊహించని దెబ్బ! | 9 |
| 1. నా కలల ప్రపంచంలోకి... | 11 |
| 2. 'ఎత్తుపల్లాల' మెడిసిన్ | 25 |
| 3. మర్చిపోలేని మహాఘటన | 44 |
| 4. నేనో బిడిఓ, నామీదో కేసు! | 56 |
| 5. పాఠాలు విన్నచోటే, పాఠాలు చెప్పా | 65 |
| 6. అది మధురం!... గరంగరం! | 76 |
| 7. పేరు, ప్రతిష్ఠ – అమ్మ! | 87 |
| 8. కన్నీటి వర్షం! | 102 |
| 9. నన్ను సర్జన్‌గా పెంచిన నెల్లూరు | 109 |
| 10. Operation success, Patient died! | 123 |
| 11. నా చోదకశక్తి నాన్న....! | 133 |
| 12. 'God bless you' అన్నారు | 141 |
| 13. వాస్తు ముంచిందా? | 150 |
| 14. ఒక ఇష్టం – ఒక కష్టం | 159 |
| 15. మరో ఒంటరి తోడైంది, కాని....! | 166 |
| 16. నాన్నా, ప్రాక్టీస్ తగ్గించుకో | 173 |
| 17. 'సరస్వతీ' సేవలో.... | 184 |
| 18. స్నేహబంధమూ, ఎంత మధురమూ! | 190 |
| 19. అప్పుడు మందులు – ఇప్పుడు మందు! | 195 |
| 20. ఒక సార్థకత ఇదే! | 198 |
| 21. మరో జన్మ | 203 |

# ఊహించని దెబ్బ!

1996లో బరంపురం మెడికల్ కాలేజిలో పరీక్షలకి నన్ను ఎగ్జామినర్‌గా పిలిచారు.

ఎముకల శస్త్రచికిత్స నిపుణుడిగా (Ortho surgeon) అప్పటికి చాలాసార్లు ఎగ్జామినర్‌గా పొరుగు రాష్ట్రాలకి వెళ్లినవాణ్ణే. ఉత్సాహంగా బయల్దేరాను.

బరంపురంలో మెడికల్ కాలేజి వాళ్లు చాలా మర్యాదలు చేశారు. మూడు రోజుల పని అదంతా.

పని పూర్తికాగానే తిరుపతికి తిరిగి వస్తూ, దారిలో 'తనని' కలవాలనుకున్నాను. ఆ ఆలోచన రాగానే బరంపురంలో ఆమెకి ఇష్టమయ్యే రంగుల్లో మంచి చీరలు కొన్నాను. అక్కడ కాలేజి సిబ్బంది నా వెంట వుండి నాణ్యమైన చీరలు దొరికే చోట్లలో తిప్పి కొనిపించారు.

ఎంత ఉత్సాహంగా బరంపురం వెళ్లానో అంతే ఉత్సాహంగా 'తనని' కలవటం కోసం పాలకొల్లులో దిగి నర్సాపురం వెళ్లాను.

నా ఉత్సాహమంతా నీరు కారిపోయింది. తనకి కాళ్లూ, చేతులూ పూర్తిగా దోమకాట్లమయం!

పశ్చిమగోదావరి జిల్లాలోకి గోదావరి పడమటి కాల్వ, కృష్ణా తూర్పు కాలవ కూడా ప్రవహిస్తాయి. అయితే గోదావరి డెల్టాలో ఎక్కువ భాగం గోదావరి నీరే. దానికి తోడు వర్షాకాలంలో కొల్లేరు సరస్సు – 350 చదరపు మైళ్లు విస్తరించివున్న సహజ జలాశయం – పొంగితే, ఆ నీరు, గోదావరి కాల్వల (పంటల అవసరాలకు పోగా) మిగులు నీరు సముద్రంలో ప్రవహించటానికి సమయం తీసుకుంటుంది. అదంతా పొలాల్లోంచి ప్రవహించటం వల్ల మురుగునీరుగా మారుతుంది. ఆ కారణంగా పొలాలకి దగ్గర నివసించేవాళ్లు దోమకాటుకి గురవుతుంటాయి. ఆ దోమల శక్తి ఎంతో మొదటిసారిగా చూస్తున్నాను.

'తనని' తీసుకొని తిరుపతికి వచ్చి, దోమకాటుకి మందులు ప్రారంభించాను. రెండు వారాలకి జ్వరం వచ్చేసింది.

భయంకరమైన జ్వరం....

మలేరియాకి కారణమైన దోమల్లో అత్యంత ప్రమాదకరమైన బాక్టీరియా వున్నట్లు పరీక్షల్లో తేలటం.....

అది మందేలేని 'Falci Forum' మలేరియా అని డాక్టరు నిర్ధారించటం....

దాని శక్తి కారణంగా చిన్న ప్రేగులు సయితం తూట్లుపడిపోవటం....

ఆపరేషన్ చేసి కాపాడాలని డాక్టర్లు చేసిన ప్రయత్నంలో ఆమె కిడ్నీలు కూడా విఫలమవటం...

క్షణక్షణానికీ ఆరాటం, ఆదుర్దా పెరిగిపోగా, నన్ను బెంగ, భయం చుట్టుముట్టి, చివరికి డయాలసిస్ మీదయినా తనని దక్కించుకోవాలని నిద్రాహారాలు మాని, తననే అంటిపెట్టుకుని ప్రతిక్షణం ప్రతిక్షణం ఆమె దక్కాలని ఎంతగా తపించినా....

డా. రమేష్‌నాథ్ అనుక్షణం.... చివరి క్షణం దాకా నన్ను అంటిపెట్టుకునే నాకు ధైర్యం చెబుతూ ఉన్నా....

ఆమె దక్కలేదు.

నన్ను ఒంటరి వాణ్ణి చేసి వెళ్లిపోయింది.

1996 జులై 14 రాత్రి వెంటిలేటరు మీదనే గుండెపోటుతో, నాకు గుండెకోత మిగిల్చి వెళ్లిపోయింది.

ఆమె నా ప్రాణం.... సహధర్మ చారిణి

సరస్వతి!

# 1. నా కలల ప్రపంచంలోకి...

ఈ దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం –

అవిభక్త మద్రాసు రాష్ట్రంలో కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో 1940 అక్టోబరు 23న జన్మించాను. నాకు జన్మనిచ్చిన పుణ్యమూర్తులు ఎర్రమిల్లి నారాయణరావు – కౌసల్య దంపతులు.

నాన్న ఉద్యోగం రీత్యా బాల్యం పదేళ్లూ మద్రాసు (చెన్నై)లోనే గడిచింది. అయిదో ఏట నన్ను శ్రీరామకృష్ణ మిషన్ ఎలిమెంటరీ స్కూలులో చేర్చారు. స్కూలు చదువులో కన్నా అల్లరి చేయటంలో చాలా ముందుండేవాణ్ణి. నా అల్లరికి చాలా తరచుగా బాధితుడు మా అన్నయ్య సీతారామ్.

అలాంటి చరిత్రాత్మక సంఘటనల్లో ఒకటి – నాలుగైదేళ్ల వయసులో నేను మా అన్నయ్య సీతారాం వీపుమీద ఎక్కి కోతిలా గెంతులు వేశాను. వాడు తట్టుకుంటున్న కొద్దీ గెంతుల్లో వేగం పెంచాను. (అందువల్ల వాడికి ఒళ్లంతా గట్టిపడుతుందని అప్పట్లో అనుకొని వుంటాను.) అంతే! వాడు బ్యాలన్సు తప్పి పడిపోయాడు. ముక్కు గచ్చునేలకి కొట్టుకుంది. షరా మామూలు గానే వాడి ముక్కు నుంచి రక్తం వచ్చింది. వాడు అనవసరంగా భయపడిపోయి 'కెవ్వు' అంటూ గావుకేక పెట్టాడు. మా అమ్మ ఇంట్లోంచి దొడ్లోకి పరుగెత్తుకు వచ్చింది. "అయ్యో.... అయ్యో.... పిల్లాడికి ముక్కులో రక్తం" అంటూ అమ్మ హడావుడి చేసేసరికి నేనూ ఆలోచించాను. 'నాన్న ఆఫీసు నుంచి వచ్చేస్తుంటాడు ఈ పాటికి. రాగానే సీను చూసి, నాకు చాకిరేవు పెడతాడు' అని తెలివిగా ఊహించి, నాన్నకి కనబడకుండా దొడ్లో బావి వెనకాల దాక్కున్నాను.

నాన్న వచ్చారు. అన్నయ్య ముక్కులో రక్తం నాన్న ఒంట్లో రక్తం మరిగించింది. కోపంగా నాన్న 'కిట్టూ.... కిట్టూ' అంటూ కేకలు పెట్టి, దొడ్డంతా కలయచూస్తున్నారు. అప్పుడు ఇంకాస్త తెలివిగా ఆలోచించి, బావి వెనకాలున్న నీళ్ల బక్కెట్‌ని దభీమని బావిలోకి తోసేశాను.